
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 38.6 కనిష్టం 25.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 28 మార్చి 2025





ఉగాది నుంచి సన్నబియ్యం

- జిల్లాలో 2.08లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం
- 412 రేషన్ దుకాణాల ద్వారా పంపిణీకి చర్యలు
- బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా పకడ్బందీ చర్యలు
- బయోమెట్రిక్‌తోనే అమలు

నిర్మల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండుగ రోజు నుంచి రేషన్ కార్డుదారులందరికీ దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యంను పంపిణీ చేసేందుకు నిర్ణయించడంతో పేద వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న దొడ్డుబియ్యం స్థానంలో ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోం ది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ సన్నబియ్యం పథకాన్ని తెరపైకి తెస్తోంది. జిల్లాలో మొత్తం 2.08. 606 లక్షల కార్డులందరికీ సన్నబియ్యం పంపిణీని చేపట్టబోతున్నారు. 19 మండలాల్లో గల 412 రేషన్ దుకాణాల ద్వారా ఇక సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని తలపెట్టారు. సన్నబియ్యం పంపిణీ విషయమై ఇప్పటికే అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ అధికారులు రేషన్‌డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సన్నబియ్యం పంపిణీని కూడా ఇప్పటి మాదిరిగానే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. అయితే సన్నబియ్యం పంపిణీలో ఎక్క డా కూడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోబోతున్నారు. దొడ్డుబియ్యం పంపిణీలో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. సన్నబియ్యం నల్లబజారుకు తరలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోబోతున్నారు. దీని కోసం గానూ ఇటు రేషన్ దుకా ణాలు అలాగే బియ్యం పంపిణీ చేసే మండల్ లెవల్‌స్టాక్ పాయింట్‌లపై ప్రత్యేకనిఘా సారించనున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ విభాగాలు ప్రతినెల ముమ్మర తనిఖీలు చేపట్టనున్నాయి. రేషన్ దుకాణాలతో పాటు కొంతమంది రేషన్‌డీలర్లతో పాటు కొంతమంది లబ్ధిదారులు కూడా బియ్యాన్ని అమ్ముకుంటున్నట్లు ఫిర్యాదులున్న కారణంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ దిశగా కూడా దృష్టి సారించనున్నారు. ప్రతి తెల్లరేషన్ కార్డు ఉన్న వినియోగదారునికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని అందించనున్నారు. అలాగే అన్నపూర్ణ కార్డుదారునికి పది కిలోలు, అంత్యోదయ కార్డు ఉన్న వారికి 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

జిల్లాలో 2,08,606 లక్షల రేషన్ కార్డుదారులు


కాగా జిల్లాలో మొత్తం 2,08,606 లక్షల తెల్లరంగు రేషన్ కార్డుదారులున్నారు. ఇందులో ఎఎఫ్ఎస్‌సీ కార్డుదారులు 12,827 మంది, ఎఫ్ఎస్‌సీ కార్డుదారులు 1,95,747 మంది, ఎఏపీ కార్డుదారులు 32 మంది ఉన్నారు. కాగా వీరందరి కోసం 39,95,745 కిలోల సన్నబియ్యం అవసరం కానున్నాయి. దీనికి అనుగుణంగా సన్నబియ్యం సేకరణతో పాటు ఎమ్మెల్యేస్ పాయింట్‌లలో నిల్వలు తగ్గకుండా చర్యలు చేపట్టబోతున్నారు. అయితే ఈ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని ఎమ్మెల్యేస్ పాయింట్‌లకు సన్నబియ్యంను తరలిస్తున్నారు. రెండు మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం నిల్వ ఉండేట్లు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధర ఎక్కువగా ఉండడంతో ఈ బియ్యం పక్కదొవ పట్టకుండా అధికారులు పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టబోతున్నారు. లబ్ధిదారులకే నేరుగా బియ్యం పంపిణీ జరిగేట్లు చర్యలు తీసుకోనున్నారు.

ఇక క్రియాశీలకంగా విజి'లెన్స్'

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయతలపెట్టిన సన్న బియ్యం పంపిణీపై సీరియస్‌గా దృష్టి సారించబోతోంది. ఇప్పటి వరకు రేషన్ బియ్యంపై అనేక ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమవుతోంది. ఎట్టి పరిస్థితుల్లో సన్నబియ్యం పక్కదోవ పట్టకుండా ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ విభాగాలను మరింత క్రియాశీలకం చేయాలని నిర్ణయించారు. ఇక నుంచి ఈ విభాగాలకు చెందిన అధికారులు నిరంతర తనిఖీలతో పాటు పకడ్బందీ నిఘాను సారించనున్నారు. వీరికి టార్గెట్‌లను సైతం నిర్ణయించారంటున్నారు. సన్నబియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా ఈ బియ్యం సరిహద్దులు దాటకుండా కూడా అక్కడి చెక్‌పోస్టులపై నిఘా పెట్టనున్నారు. అవసరమైతే చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించనున్నారు. పోలీసుశాఖ సహకారం కూడా తీసుకోనున్నారు.

సంబురపడుతున్న పేదలు

కాగా ప్రభుత్వం ఉగాది పండగ నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేయనున్న కారణంగా ఆ బియ్యం ద్వారా లబ్ది పొందే పేదలంతా సంబురపడుతున్నారు. ఇప్పటి వరకు గత్యంతరం లేక తాము దొడ్డ బియ్యాన్నే తింటువచ్చామని ప్రభుత్వం తమను కనికరించి సన్నబియ్యాన్ని పంపిణీ చేయడం హర్షనీయమంటున్నారు. ఇది లా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నెరవేర్చుకునే భాగంలో పేదలందరికి సన్నబియ్యం పంపిణీ చేయనుండడంతో అధికార కాంగ్రెస్ పార్టీ వ ర్గాలు సైతం సంబురాలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్నాయి. రేషన్ లబ్ధిదారులతో కలిసి సంబురాలు నిర్వహిం చుకోవాలని భావిస్తున్నారు. ఊరురా సన్న బియ్యం సంబు రం పేరిట నిర్వహించే ఈ కార్యక్రమాల్లో సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం నిర్వహించనున్నారు.



12న వీర హనుమాన్ విజయయాత్ర

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 12న నిర్మల్ పట్టణంలో వీర హనుమాన్ విజయ యాత్ర నిర్మల్‌లో నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్, బజరంగ్ దళ్ నగర్ సంయోజక్ కూన సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి దేవరకోట ఆలయ ప్రాంగణం నుండి శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. శ్రీరాముడు, హనుమంతుడి భారీ విగ్రహాలతో నిర్వహించే శోభాయాత్రలో జిల్లాలోని హిందూ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లెప్రసీ కేస్ డిటెక్షన్ కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర పరిశీలకుడు



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ సాగర్

నిర్మల్ అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకుడు సాగర్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్, బంగల్‌పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గృహాలలో వ్యాధిగ్రస్తులను పరిశీలించారు. కార్యక్రమాన్ని అంకితభావంతో నిర్వహించాలని, లెప్రసీ లక్షణాలున్న వారిని గుర్తించి చికిత్స అందేలా కృషిచేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించండి : ఎస్ఈ

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు ప్రతీనెల తమ బిల్లులను తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా చెల్లించాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం ఒక ప్రకటనలో కోరారు. నిర్మల్ సర్కిల్‌లో 31,025 మంది వినియోగదారులు యాప్‌తో పాటు గూగుల్ పే, ఫోన్ పే తదితర యూపీఐల ద్వారా చెల్లిస్తున్నారని తెలిపారు. యాప్ ద్వారా చెల్లిస్తే సమయం ఆదా అవుతుందని, క్యూ లైన్‌లలో నిలబడాల్సిన అవసరం తప్పుతుందన్నారు. సురక్షితంగా చెల్లింపులు జరుపుకోవచ్చునని సూచించారు.

29న ఖానాపూర్ తైబజార్ వేలం

ఖానాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మొగల్పురాలో గల మున్సిపల్ తైబజార్ బహిరంగ వేలం ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. ఏప్రిల్ 1 2025 నుండి మార్చి 31 2026 వరకు ఈ తైబజార్ కాల పరిమితి ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు నేటి తేదీన ఖానాపూర్ మున్సిపల్ పేరిట రూ.లక్ష డీడీని తీసి శుక్రవారం సాయంత్రం 5 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. శుక్రవారం లోపు డీడీలు అందజేసిన వారు మాత్రమే శనివారం నిర్వహించే వేలంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ వేలం పాటలో తైబజార్‌ను దక్కించుకున్న వారు 24 గంటల్లోపు సగం డబ్బులను చెల్లించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి.. ఒకరిపై కేసు

నర్సాపూర్(జి), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురాటి గ్రామ బస్టాండ్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీ అనే మహిళ మృతి చెందింది. ఏఎస్సై శంకర్ వివరాల ప్రకారం కుంటాల గ్రామానికి చెందిన తోట గజేందర్ బైక్ వేగంగా నడుపుతూ లక్ష్మీ అనే దంపతులను ఢీకొట్టాడు. దీంతో లక్ష్మీ మరణించింది. గురువారం ఆమె భర్త బి. నారాయణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

గోర్ బోలి భాష లిపిగా మార్చడం హర్షనీయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్‌లో బంజారాల గోర్ బోలి భాష లిపిగా మార్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తుకారాం కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ తీర్మానం చేయడం బంజారా జాతికి ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. భావితరాలకు ఈ లిపి దోహదం చేస్తుందన్నారు. జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్, రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్, బెల్లయ్య నాయక్, బంజారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. భూక్యా భీమ్‌రావు, భీమ్‌సింగ్, రాజేందర్ రాథోడ్, దూప్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా అల్లూరి మల్లారెడ్డి




న్యాయవాదుల సంఘ నూతన కార్యవర్గం

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా అల్లూరి మల్లారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికలు నిర్వహించగా సమీప ప్రత్యర్థిపై 17 ఓట్ల ఆధిక్యత సాధించారు. ప్రధాన కార్యదర్శిగా షేర్ నరేందర్ 7 ఓట్ల ఆధిక్యం సాధించారు. ఉపాధ్యక్షుడిగా అంపోలి నర్సారెడ్డి, కోశాధికారిగా సిహెచ్. అర్చన, సంయుక్త కార్యదర్శిగా ఏ. ముత్తన్న, గ్రంథాలయ కార్యదర్శిగా ఆర్.రత్నం, ఆటల కార్యదర్శిగా పి. వంశీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు నూనె గంగాధర్, ఓస మహేందర్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేష్

ఖానాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొన్న ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ముగిశాయి. ఈ ఎన్నికల్లో ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మంత్రరాజం సురేష్ ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవి మినహా మిగతా పదవులన్నీ ఏకగ్రీవమైనట్లు వారు తెలిపారు. ఎన్నికల్లో ఖానాపూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పి. రాజలింగం, కోశాధికారిగా పి.రాజు, జాయింట్ సెక్రటరీగా పీలి కమలాకర్, లైబ్రరీ కార్యదర్శిగా టి. సురేష్‌లు ఎన్నికైనట్లు వారు పేర్కొన్నారు.

ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన



నర్సాపూర్(జి), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం డీపీఆర్‌వో ఆదేశాల మేరకు ఓటు హక్కు ఆవశ్యకత, పచ్ఛదనం, పరిశుభ్రత, వడ దెబ్బ నివారణ తదితర అంశాలపై కళాకారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కళాకారుల నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కైలాస్ రాథోడ్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, తదితరులు ఉన్నారు.

యూడీఐడీ కార్డుల ప్రక్రియ ప్రారంభించాం

- సెర్ప్ సీఈవోకు కలెక్టర్ వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో యూడీఐడీ కార్డుల అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రారంభిచామని కలెక్టర్ అభిలాష అభినవ్ సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌కు వెల్లడించారు. గురువారం సెర్ప్ సీఈవో హైదరాబాద్ నుండి ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, ఇందిరా మహిళాశక్తి పెట్రోల్ బంకులు, ప్రమాద భీమా తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. సీఈవో ఈ సందర్భంగా కార్డులు పొందేందుకు అర్హులైన దివ్యాంగులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పంపిణీకి ఏకరూప దుస్తుల తయారీకి ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకులు, విద్యుత్ వాహనచార్జింగ్, మహిళాశక్తి బజార్‌ల ఏర్పాటు తదితర వాటిపై ఆదేశాలిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ... యూడీఐడీ కార్డుల నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సందేహాలు తొలగించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళా పెట్రోల్ బంకులు, వాహన చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు పూర్తయిందన్నారు. మహిళా శక్తి బజార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐకేపీ ద్వారా ఈ సంవత్సరం నుండి అదనపు వరి కొనుగోలు కేంద్రాలు కేటయిస్తామని, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఆర్డీవో అధికారి శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ముజ్గి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు, ఇన్ పేషెంట్ వార్డు, ఆయుష్ క్లినిక్, డ్రగ్స్ స్టోర్‌రూమ్‌లను సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు లభిస్తున్న సదుపాయాలపై వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని, ఆసుపత్రుల్లో సరిపడినన్ని బెడ్లు, మందులు, ఇతర వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. అందిస్తున్న వైద్య చికిత్సలు, మందులను రోజువారీగా రిజిస్టర్‌లలో నమోదు చేయాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆసుపత్రిలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడుతూ... ఆసుపత్రిలోని సౌకర్యాలు, అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్య శాఖ అధికారులు శ్రీనివాస్, రవీందర్, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానంద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన జిల్లా న్యాయాధికారి



చిన్నారిని అభినందిస్తున్న జిల్లా న్యాయమూర్తి రాధిక

సోన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలానికి సంబంధించిన భవిత కేంద్రాన్ని గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి రాధిక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విభిన్న ప్రతిభావంతులని, వీరు దైవంతో సమానమని, వీరికి ప్రత్యేక శ్రద్ధ, సహకారం అవసమన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు వేసిన చిత్రాలను ఆమె పరిశీలించారు. స్వయంగా చిత్రం వేసి దానికి విద్యార్థులచేత రంగులు వేయించారు. విద్యార్థులకు నోట్ బుక్, పెన్సిళ్లను చిరు కానుకగా అందించారు. పిల్లల కోసం ప్రత్యేక చట్టాలు కూడా రూపొందించడం జరిగిందని, వీరి పట్ల అందరూ గౌరవభావం కలిగి ఉండాలని, వారికి పూర్తి సహకారం, తోడ్పాటును అందించాలని తెలిపారు. వారి పట్ల జరిగే వివక్ష, విపరీత ధోరణులు, సంఘటనలపై చట్టంలో సూచించిన విధంగా తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతులైన అమ్మాయిలపై జరిగే చర్యల గురించి అస్సలు ఉపేక్షించడం జరగదని, చట్టం ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడుతూ... ప్రాథమిక విద్యార్థులకు కూడా గుట్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విలీన విద్య సమన్వయకర్త ఎన్. ప్రవీణ్‌కుమార్, మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్, రిసోర్స్ ఉపాధ్యాయులు సంధ్యారాణి, ప్రత్యేక ఉపాధ్యాయుడు రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి) వారసంత వేలం పూర్తి

నర్సాపూర్(జి), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్వహించే వారసంత వేలం ముగిసింది. వేలంలో మోహినుద్దీన్ దక్కించుకున్నారు. గురువారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారసంత వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా మోహినుద్దీన్ రూ.2,32,278లకు వేలం పాటపాడి వారసంత హక్కులను దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కైలాస్ రాథోడ్, సట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముథోల్‌లో రూ.1.82 లక్షలకు ..

ముథోల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని వారసంతకు గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. అయితే ఐదుగురు వేలంలో పాల్గొనగా ఎండీ లయక్ అనే వ్యాపారస్తుడు లక్ష ఎనభై రెండు వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, ఈవో అన్వర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో ఏఎస్పీ రాజేష్‌మీనా

నిర్మల్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణాపూర్‌లో బుధవారం ఏఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో కిరాణా, బెల్ట్ షాపుపై దాడి నిర్వహించారు. ఎస్పీ రాజేష్ మీనా తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని ఆడే చందులాల్ అక్రమంగా ఎలాంటి అనుమతి లేకుండా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా సుమారు 103 లీటర్ల మద్యం, దాని విలువ రూ. 73,187 ఉంటుందని తెలిపారు. ఈ మేరకు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎం. కృష్ణ, ఏఎస్సై బాబారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ, ఉపాధికి దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ జనరేషన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ, ఉపాధి కోసం జిల్లాలోని ఎస్సీ, మైనారిటీ యువకులు ఈ నెల 29న దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లా డీఆర్డీవో కార్యాలయంలో స్టడీ, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. హైదరాబాద్‌లో 5 నుండి 7 నెలల ఉచిత శిక్షణ, భోజన వసతి, ఉపాధి కల్పిస్తారని పేర్కొన్నారు. టెలి హెల్త్ సర్వీస్ కోఆర్డినేటర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో శిక్షణ ఉంటుందని తెలిపారు. 18 నుండి 30 ఏళ్ల లోపు వారు అర్హులు. విద్యార్హతలు టెన్త్, ఇంటర్ అని తెలిపారు.

ఫ్లెక్సీ తయారీకి టెండర్ల ఆహ్వానం

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రైతు రుణ మాఫీ, రైతు భరోసా లబ్ధిదారుల వివరాలు ప్రదర్శించేందుకు ఫ్లెక్సీ తయారుదారులు రేపటిలోగా టెండర్లు దాఖలు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గలవారు వ్యవసాయ అధికారి కార్యాలయంలో పది వేల రూపాయల డీడీ తీసి కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో మధ్యాహ్నం 2 గంటలలోపు సమర్పించాలన్నారు. జీఎస్టీ పత్రాలు సమర్పించాలని సూచించారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు, కుటుంబ సభ్యులకు ఉచిత కంటి పరీక్షలు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు పెన్షనర్ల సంఘ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు సివిల్ సప్లై హమాలీల 4వ మహాసభ

నిర్మల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద శుక్రవారం సివిల్ సప్లైస్ హమాలీ సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసాచారి, పుండలిక్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, కార్యదర్శి ఎస్. విలాస్ హాజరుకానున్నట్టు తెలిపారు. హమాలీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి'

ఉట్నూర్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సామాజిక గణన సర్వే చేసిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను వెంటనే చెల్లించాలని టీజీటీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్‌రాథోడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా నిర్వహించిన ఆర్థిక సామాజిక జనగణనలో భాగంగా ఇంటింటికి వెళ్లి జనగణన సర్వే చేసిన ఉపాధ్యాయులకు మాత్రం ఇప్పటి వరకు సర్వే డబ్బులు ఇవ్వకపోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్థిక సామాజిక సర్వే గణన చేసిన ఉపాధ్యాయులకు నిధులు విడుదల చేయాలని సంఘం పక్షాన కోరుతున్నామన్నారు.

ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా భీమన్న



ఉట్నూర్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరి రక్షణ సమితి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గుడిపల్లి భీమన్నను నియమిం చామని రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న తెలిపారు. ఆదివాసీ నాయక్‌పోడ్ గిరిజనులను సంఘటితపరిచి చైతన్యం చేయడానికి జిల్లా అధ్య క్షులు కృషి చేయాలన్నారు. అదే విధంగా మండల కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన భీమ న్న మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ఆదివాసీ నాయక్‌పోడ్ మండల కమిటీలను ఖరారు చేస్తామన్నారు.

పోటాపోటీగా సాగిన షాంపూర్ సంత వేలం

ఉట్నూర్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షాంపూర్ గ్రామంలో వారసంతకు నిర్వహించిన వేలం పాట పోటాపోటీగా కొనసాగింది. ప్రత్యేక అధికారి, కార్యదర్శి ఆధ్వర్యంలో షాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన తైబజార్ వేలంలో జాదవ్ వికాస్, మేస్రం చందుపటేల్, గుండాల సంతోష్‌లు పంచాయతీ అధికారులకు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. సాలెవాడ బీకి చెందిన మేస్రం చందుపటేల్ రూ.1.45లక్షలకు పాట పాడిసంతను దక్కించుకున్నారు. ఈ సారి 65వేల వరకు అధికంగా గ్రామ పంచాయతీకి లాభం వచ్చిందని ఎంపీఓ సుధీర్‌రెడ్డి తెలిపారు.

ఇంద్రవెల్లి : మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారసంతకు గురువారం మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మేజర్ పంచాయతీ ఈవో సంజీవ్ రావు ఆధ్వర్యంలో వారసంత వేలం పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలంలో వారసంత వేలంపాట సంతను మండల కేంద్రానికి చెందిన కినక భీంరావ్ రూ.9లక్షల 80 వేలకు తీసుకున్నామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సోమోరే నాగోరావు, పంచాయతీ సిబ్బంది జైస్వాల్ శంకర్ లాల్, గాయక్ వాడ్ నారాయణ, ఇద్రిష్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి వివాహానికి ఆర్థికసాయం

ఇచ్చోడ, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాదిగూడ గ్రామంలోని యువకుడి వివాహానికి గ్రామ ఆడపడచులంతా ఏకమై ఏకంగా రూ.25 వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పెద్దలు నిశ్చయించిన వివాహానికి అవసరమయ్యే సొమ్మును ఆ గ్రామమంతా కలిసి రూ.25వేలను పెళ్లిఖర్చుల కోసం ఆ కుటుంబానికి ఆర్థిక సాయంగా అందించారు.

అనాథ పిల్లలకు సహాయం

నార్నూర్ : గాదిగూడ మండలంలోని దాబా(కే) గ్రామానికి చెందిన దేవ రావు రాజేశ్వరి గత సంవత్సరం అనారోగ్యం కారణంగా మృతిచెందారు. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న షైమన్ డార్ప్ బెట్టి ఎలిజబెత్ స్మారక గ్రంథాలయం వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ గురువారం వారి ఇంటికి వెళ్లి తనవంతు ఆర్థిక సహాయం, నిత్యవసరాలు అందించారు.

ముక్రా(బీ) గ్రామంలో పశుగణన సర్వే

ఇచ్చోడ, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్రా(బీ) గ్రామంలో గురువారం పశుగణన సర్వే నిర్వహించినట్లు ఎన్యుమరేటర్ సంధ్య తెలిపారు. ప్రతి గ్రామంలోని పశువులను లెక్కించి తదితర వాటిని గుర్తించి ఆన్‌లైన్‌లో పొదుపర్చడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేయండి : సీఐ



ఎంపికైన యువకులతో సీఐ, ఎస్‌ఐలు

బోథ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన అగ్నివీర్ సెలక్షన్లలో బోథ్ పట్టణానికి చెందిన ఎం.శివాజీ, కె.ప్రసంజలు ఎన్నికయ్యారు. అయితే ఎంపికైన ఇరువురు యువకులను బోథ్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ ప్రవీణ్‌లు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎంపికైన యువకులు దేశసేవ కోసం అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. భవిష్యత్తులో ఉన్నతులుగా ఎదగాలంటే క్రమశిక్షణ అవసరం అన్నారు.

గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన

ఇంద్రవెల్లి , మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆందునాయక్ తండా గ్రామంలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సీఐ మొగిలి మాట్లాడుతూ గ్రామంలో యువకులు గంజాయి అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, ఎవరైనా గంజాయి అమ్మినా, తాగినా సమాచారం అందించాలని యువకులకు సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోనుచేసి మీ యొక్క సమాచారం సేకరిస్తారని, వాటి ద్వారా మీ అకౌంట్ నుంచి డబ్బులు మాయం చేస్తారని హెచ్చరించారు. ఎవరైనా గుర్తుతెలియని వారు ఫోన్లు చేస్తే సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందించాలని అన్నారు. యువకులు స్మార్ట్‌ఫోన్ వాడటం వల్ల అందులో కొత్తగా యాప్‌ను వేసుకుని సైబర్ నేరాలకు బలి అవుతున్నారని హెచ్చరించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగిన వెంటనే వందకు ఫోన్‌కాల్ ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

గుడిహత్నూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూర్ సాయినగర్ వద్ద గురువారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని అమరావతి నుంచి హైదరాబాద్‌కు బత్తాయి పండ్లను ఐచర్ వాహనంలో తీసుకువెళ్తుండగా మన్నూర్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీని ఐచర్ వాహనం ఢీకొనడంతో ఆంధ్రప్రదేశ్‌లోని కనిగిరి జిల్లాకు చెందిన ఐచర్ డ్రైవర్ మల్లికార్జున్(36) అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి శవపంచనామా చేసి మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉట్నూర్ : మండలంలోని షాంపూర్‌లో ఆర్థిక ఇబ్బందులతో పాటు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాబు (45) గురువారం ఇంట్లో ఉరివేసుకొని మృతిచెందినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఆయన కథనం మేరకు హమాలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న బాబుకు కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. అదే కాకుండా భార్య దృపద సైతం అనారోగ్యంతో బాధపడుతున్నందున చాలీచాలని జీవితాలతో కాలం గడుపుతూ మానసిక వేదనకు గురైన బాబు ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిందన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

బోథ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ గ్రామం లో ఎస్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరు అయిన ఐదు లక్షల రూపా యలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ చొరవతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ గొల్ల రాజు యాదవ్, డైరెక్టర్లు అబ్రార్, మైనార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు, అరుణ్ రెడ్డి, పోతారెడ్డి, గంగారెడ్డి, నారాయణ, గడ్డల తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల పేరిట అడ్డగోలు దందా

(5వ పేజీ తరువాయి)

తరలించుకు పోతున్నారో అధికారులే సమాధానం చెప్పాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో బీటీ రోడ్లు దెబ్బతింటున్న పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా అసలు పట్టించుకోవడం లేదంటున్నారు.

అడిగినంత ఇస్తే అనుమతులకు ఓకే..

కొంత మంది అధికారులకు అడిగినంత ఇస్తే అనుమతులు గంటల వ్యవధిలోనే ఇచ్చేయడం పరిపాటిగానే మారిందంటున్నారు. లేదంటే నిబంధనల పేరిట కొర్రీలు పెడుతూ ముప్పుతిప్పలు పెట్టడం అలవాటుగానే మారింది. అభివృద్ధి పనుల సాకుతో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. కజ్జర్ల అసైన్డ్ భూముల్లో మొరం క్వారీల అనుమతుల్లోనూ ఇదే జరిగిందన్న ఆరోపణలు వస్తున్నాయి. అసైన్డ్ భూములను కాపాడాల్సిన సంబంధిత అధికారులే బొందలగడ్డలుగా మార్చడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. దళిత రైతుల జీవనోపాధి కోసం గత ప్రభుత్వం అసైన్డ్ భూములను కేటాయించింది. కానీ అవి సాగుకు యోగ్యంగా లేక పోవడంతో బడా కాంట్రాక్టర్ల కన్నుపడి కనిపించకుండానే పోతున్నాయి. రోజుల వ్యవధిలోనే అసైన్డ్ భూములు కనిపించకుండానే పోతున్నాయి. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. అమాయక రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటు అసైన్డ్ భూముల్లోనే మొరం తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ కవిత

ఆదిలాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి జోగు రామన్నను గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ పరిస్థితులపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే దీక్షల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు.

'ఆదివాసుల సమస్యలు తీరుస్తా'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం, మంత్రి సీతక్క కాళ్ల మొక్కి అయినా సరే ఆదివాసుల సమస్యలు పరిష్కరిస్తానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం మావల మండలంలోని కొమురం భీం కాలనీలో ఆదివాసులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆదివాసులకు కరెంటు, తాగునీరు, ఇంటి పట్టాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

బోథ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బోథ్ క్రాస్ రోడ్డు నుంచి బుధవారం సాయంత్రం మండలంలోని అందూర్ గ్రామానికి చెందిన పోతలింగు అనే వ్యక్తికి చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. బుధవారం మధ్యాహ్నం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాన్ని పార్కింగ్ చేసి ఆదిలాబాద్ వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చే లోపు వాహనం కనిపించలేదు. గురువారం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా క్రాస్ రోడ్డు నుంచి గతంలో సైతం రెండు సార్లు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ విషయ మై స్థానిక నేరేడిగొండ ఎస్సై శ్రీకాంత్ వివరణ కోరగా సీసీ కెమెరాలు త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

'ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటు'

ఇచ్చోడ, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటని విక్టరీ పాస్టర్ అసోసియేషన్ బోథ్ అధ్యక్షుడు నెహెమ్యా అన్నారు. గురువారం ఇచ్చోడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రవీణ్ మృతికి సంబంధించి సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సదానందం, ఉపాధ్యక్షుడు నరేష్, మాణిక్యం, రమణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు : వన్‌టౌన్ సీఐ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ హెచ్చరించారు. రామ్‌లీలా మైదానం, డైట్‌కళాశాల మైదానం ప్రదేశాల్లో మద్యం తాగిన ఇద్దరికి ఆదిలాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామస్వామి రూ.600 చొప్పున జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు.

బరంపూర్‌లో చలి వేంద్రం ఏర్పాటు

తలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన మహేష్ యాదవ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన ముడుపు కేదారీశ్వర్ రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లేష్‌గంగారాం తదితరులు ఉన్నారు.

నాయకుల అరెస్టు

భీంపూర్ , మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మడావి లింబాజి, మడావి వినోద్, సీడం అశోక్, బండును భీంపూర్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి లక్ష్మీపూర్ వద్ద అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. తమ నాయకుడు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు మేరకు వెళుతున్న తమకు అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. ఈ అక్రమ అరెస్టును బీఆర్‌ఎస్ నాయకులు మేకల నాగయ్య, కుడి మేత సంతోష్, బక్కి కపిల్‌లు తీవ్రంగా ఖండించారు.

'ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలి'

ఇంద్రవెల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాజీ డీఎంహెచ్‌వో వసంత్‌రావు ఆధ్వర్యంలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌ను తెలంగాణ మహిళా కమి షన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ డీఎంహెచ్‌వో వసంత్ రావు ఏజెన్సీ ప్రాంతంలో వైద్యసేవలు అందించి పదవీవిరమణ పొం దిన తర్వాత స్థానికంగా మన ప్రాంతంలో సేవలందించాలన్న సదుద్దేశంతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

'ప్రేమసాగర్ రావుకు మంత్రి పదవి ఇవ్వాలి'

నార్నూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జరిగే మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమసాగర్ రావుకు మంత్రి పదవి ఇవ్వాలని నార్నూర్ మండల యువజన సంఘం ఉపాధ్యక్షుడు షేక్‌మొహమ్మద్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ నాయ కులతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంత్రి వర్గంలో చోటు లేక చాలా వరకు అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ఈ సారి అవకాశం ఇవ్వాలన్నారు.

'బంజారాలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి'

సిరికొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి):బంజారా సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని బంజారా సంఘం బోథ్ నియోజకవర్గ అధ్యక్షులు దరావత్ నరేందర్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బంజారాల పాత్ర ముఖ్యమైందన్నారు. తక్షణమే మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

● ఎంజేపీ జాయింట్ సెక్రటరీ తిరుపతి



ఎంజేపీ జాయింట్ సెక్రటరీకి జ్ఞాపికను అందజేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మామడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిరుపతి అన్నారు. గురువారం రోజున మామడ మండలంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ... పదవ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్నటువంటి నేపథ్యంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఇప్పటి వరకు జరిగినటువంటి లాంగ్వేజెస్ పరీక్షల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు సాయంత్రం నైట్ స్టడీ అవర్స్‌లో టీ, స్నాక్స్ అందించాలని, విద్యార్థులు ఎవరు కూడా మాస్ కాపీయింగ్‌కు పాల్పడవద్దని కష్టపడి చదివితే ఫలితం వస్తుందని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. పరీక్ష జరిగే సమయంలో భయం వీడి లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. రాజు, పీఈటీ శ్రీకాంత్, నాగరాజు, నర్సయ్య, వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రంలో బెంచీల ఏర్పాటు

ముథోల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్ష సెంటర్‌లో గురువారం సంబంధిత అధికారులు బెంచీలను ఏర్పాటు చేశారు. డీఈవో రామారావు బుధవారం పరీక్ష సెంటర్‌ను పరిశీలించినప్పుడు సెంటర్‌లోని ఒకటవ, రెండవ రూమ్‌లలో విద్యార్థులకు చిన్న బెంచీలు ఉండటంతో వెంటనే వాటిని మార్చి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా వేరే బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో గురువారం సంబంధిత నిర్వాహక అధికారులు, ఎంఈవో రమణ రెడ్డిలు వేరే బెంచీలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలి

కుంటాల, మార్చి, 27 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని కుంటాల ఆదర్శ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు రకాల కళలు, సాహిత్యం, వంటకాల తయారీ, మిఠాయిల తయారీ తదితర వంటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం హర్యానా రాష్ట్రంలో కొనసాగుతున్నందున రాబోయే రోజులలో అన్ని రాష్ట్రాలలో హర్యానా తరహాలో సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించాలని ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు విద్యార్థులు ఉన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించాలి

లక్ష్మణచాంద, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాలువకు ఏప్రిల్ చివరి రోజు వరకు సాగు నీరు అందించాలని మాజీ ఎంపీపీ కేశం లక్ష్మీ రమేష్ కోరారు. ఏప్రిల్ 2 వరకు మాత్రమే సాగునీరు అందిస్తామని ఎస్సారెస్పీ అధికారులు విడుదల చేసిన ప్రకటనను సోషల్ మీడియాలో చూసిన రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. లక్ష్మణచాంద మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ ఎస్సారెస్పీ కెనాల్ సాగునీటిపై ఆధారపడి రైతులు వరి పంటలు వేసుకున్నారు. ఈ వరి ప్రస్తుతం గింజ దశలోనే ఉంది. ఈ గింజ బలపడి ధాన్యం దశకు రావాలంటే కనీసం నెల రోజులు పడుతుందని, అందువలన ఏప్రిల్ చివరి రోజు వరకు నీరు విడుదలచేయాలని రైతులు కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు.

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించిన రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడు



కస్తూర్బా పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు ఎల్లయ్య

లక్ష్మణచాంద, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు ఎల్లయ్య గురువారం పరిశీలించారు. పాఠశాల రికార్డులు, నివేదికలు, విద్యార్థినుల సీసీఈ మార్కులు పరిశీలించారు. ఉపాధ్యాయుల టీచర్ డైరీలు, వార్షిక ప్రణాళికలు, విద్యార్థుల విషయాల వారి నోట్స్, ప్రాజెక్ట్ వర్క్ చూపటం, ఫార్మేటివ్, సమ్మేటివ్ సీసీఈ మార్కులను ఐఎస్ఎంఎస్ పోర్టల్ నందు ఆన్‌లైన్ చేయడం పరిశీలించి, తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ నందు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన బేస్ లైన్, మిడ్ లైన్, ఎండ్ లైన్ సంబంధిత జవాబు పత్రాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా నిర్వహించిన గ్రాండ్‌టెస్ట్, ప్రీ ఫైనల్ పరీక్ష పత్రాలను పరిశీలించారు. ఏ, బీ, సీ గ్రూపులుగా విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపినటువంటి నివేదికలను చూశారు. ఎల్ఐపీ (లిప్) భాషాభివృద్ధి కార్యక్రమాలపై నిరంతరం జరుగుతున్న విషయాలపై ఎప్పటికప్పుడు ప్రణాళికలు తయారు చేసి, అమలు అయ్యే విధంగా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త నర్సయ్య, మండల విద్యాధికారి ఆర్. అశోక్ వర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంపెల్లి నవిత, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు సుధాకర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు



లక్ష్మణచాంద పోలీసుస్టేషన్‌లో సర్పంచ్‌లు, నాయకులు



నర్సాపూర్(జి)లో ముందస్తు అరెస్టు చేసిన దృశ్యం

లక్ష్మణచాంద, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొందరు మాజీ సర్పంచ్‌లను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్ తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో రాష్ట్ర మాజీ సర్పంచ్ సంఘం 'అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి' పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని అరికట్టడం కోసం మండలంలోని కీలకమైన పలువురు సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, అడిచెర్ల రవికుమార్, నాయకులు కమల్‌కోట వెంకట్ రెడ్డి, బుర్రి భూమేష్, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్పంచ్‌లను ముందస్తుగా స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఫోరం మాజీ అంజనీ సర్పంచ్ భర్త శ్రీను, రాంపూర్ సర్పంచ్ గోవిందర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ అనుమతితో పనులు చేసి, అభివృద్ధి చేసినప్పటికీ ఆ పనులకు సంబంధించిన బిలులు సర్పంచ్‌లకు చెల్లించకపోవడంతో వెంటనే రిలీజ్ చేయాలని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని, అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతుండగా పోలీసులు అరెస్ట్ చేశారన్నారు.

బీజేపీది ప్రజాస్వామ్య వ్యతిరేకపాలన

ఖానాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనపై ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించేందుకే కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు అయ్యన్నగారి పోశెట్టి, ఎంబడి రాజేశ్వర్లు అన్నారు. గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పటట్న అధ్యక్షులు నిమ్మల రమేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి, మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి, మార్కెట్ యార్డ్ సమీపంలో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఇన్‌చార్జీలు పోశెట్టి, రాజేశ్వర్‌లు మాట్లాడుతూ... భారతదేశం నేడు తీవ్రమైన విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటుందన్నారు. అణువణువునా బీజేపీ భారత రాజ్యాంగాన్ని అవమాన పరుస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, పీఏసీఎస్ చైర్మన్లు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షౌకత్ పాషా, మహిళా నాయకురాలు రమాదేవి, తారాబాయి, వసంత, తదితరులున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం చేయాలి

దిలావర్‌పూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలని దిలావర్‌పూర్ మండల ఇన్‌చార్జి బాశెట్టి రాజన్న అన్నారు. శుక్రవారం సిర్గాపూర్‌లోని రుక్మారెడ్డి గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, తానూర్, మాజీ జడ్పీటీసీ ఉత్తం బాలేరావు, సీనియర్ నాయకులు కే. దేవేందర్ రెడ్డి, మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హిప్నెల్లి గ్రామంలో ..

తానూర్ , మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హిప్నెల్లి గ్రామంలో జైబాపు, జై భీం, జై సంవిదాన్, అనే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హిప్నెల్లి గ్రామంలో జైబాపు, జైభీం, జైసంవిదాన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

త్రీ ఫేస్ కరెంట్ సౌకర్యం కల్పించాలి

● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



మాట్లాడుతున్న వివిధ గ్రామ ప్రజలు

పెంబి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పెంబి మండలంలోని జీడిమాల్య, రాగి దుబ్బ గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసి గిరిజన గూడాలకు, తండాలకు త్రీ ఫేస్ విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. గురువారం వివిధ గ్రామ ప్రజలు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. పంట భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించి మమ్మల్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గం నాయకులు బన్సీలాల్ రాథోడ్‌తో పాటు ఆదివాసి గ్రామ పెద్ద ఆరే రాయుడు, తండానాయక్ గుగ్లావత్ గణేష్, రాజేందర్, రమేష్, జలపత్, చంపత్, ధన్‌సింగ్, మాలావత్ రమేష్, ముకుంద రావు, పర్శురామ్, బాబులాల్, సమస్త గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సారూ.. మా నీటి తిప్పలను తప్పించండి

● ఖానాపూర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసుల విన్నపం

ఖానాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సారు... మా కాలనీలో నీటి తిప్పలను తప్పించండి అంటూ ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ జాదవ్‌కృష్ణను వేడుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీలోని సి-5, సి-6 బ్లాక్‌లలో నివాసం ఉండే నిరుపేద ప్రజలు గురువారం నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా తమ సమస్యను కమిషనర్ జాదవ్ కృష్ణకు వివరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాజవ్వ, విజయలక్ష్మి, చంద్రకళ, లావణ్య, గంగామణి, తదితరులున్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోద్దు

● నకిలీ విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెంబి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తన వ్యాపారులు చేసే మోసాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పెంబి వ్యవసాయ అధికారి నీస్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మ్యాక్స్ సొసైటీలో నకిలీ విత్తన వ్యాపారులు చేసే మోసాల పట్ల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో పత్తి పంట అధికంగా సాగవుతుండడంతో పత్తి రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిషేధిత పత్తి విత్తనాలైన రౌండప్ బీటీ, హెచ్‌టీ కాటన్‌లను ఎవరైనా వ్యాపారులు లూజుగా తీసుకువచ్చి రైతులకు ఎలాంటి రసీదులు ఇవ్వకుండా గ్రామాల్లో అమ్ముతున్నట్లయితే వారి సమాచారాన్ని వ్యవసాయశాఖ అధికారులకు గాని స్థానిక పోలీసు అధికారులకు గాని తెలిపినట్లయితే వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. లైసెన్స్ కలిగిన విత్తన వ్యాపారుల దగ్గర మాత్రమే నాణ్యమైన విత్తనాలు లభిస్తాయని, లూజుగా గ్రామస్థాయిలో అమ్మే విత్తనాలు నాసిరకంగా ఉంటయి కావునా వీటి విక్రయానికి అడ్డుకట్ట వేసే విధంగా ప్రజలు అధికారులతో సహకరించాలని ఈ సందర్భంగా ఏవో కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలొచ్చేశాయ్


దిలావర్‌పూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలంగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఎట్టకేలకు రెండు నెలల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు మండలంలోని కాల్వ గ్రామ పంచాయతీలో గురువారం ఎంపీవో గోవర్ధన్ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలను పంపిణీ చేశారు.

ఆయిల్ పామ్ పంటలను
పరిశీలించిన శాస్త్రవేత్త


ఆయిల్ పామ్ పంటలు సాగు చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త బీఎస్‌రావు

తలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటలను గురువారం శాస్త్రవేత్త డాక్టర్ బీ.ఎస్ రావు పరిశీలించారు ఈ సందర్భంగా మండలంలోని బరంపూర్ మదనాపూర్ గ్రామాల్లో గల ఆయిల్ ఫామ్ క్షేత్రాలను సందర్శించి ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. పంట ఎదుగుదల కోసం ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. జిల్లాలో ఎంత మంది రైతులు ఆయిల్ పామ్ పంటల సాగు చేస్తున్నారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు చాలా లాభదాయకంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఆయిల్ పామ్ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. అధిక దిగుబడులను ఏ విధంగా సాధించాలో చాలా చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సుధాకర్, హార్టికల్చర్ అధికారి క్రాంతి కుమార్, పాం డీజీఎం మల్లీశ్వరరావు, ఆయిల్ పామ్ జిల్లా అధికారి శ్రీకాంత్, క్షేత్ర సహాయ అధికారి రమేష్ గణేష్ అండ్ సతీష్, రైతులు కేదారేశ్వర రెడ్డి, ఆశారెడ్డి, జనార్దన్ రెడ్డి, మనోజ్, ప్రతాప్, శ్రావణ్ కుమార్, ఇతర గ్రామాల్లో రైతులు పాల్గొన్నారు.


విశ్రాంతి భవన అవరణలో ఉన్న చెట్లు


వ్యవసాయ శాఖ కార్యాలయ అవరణలో భారీ వృక్షం


తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న చెట్లు

చల్లగా.. మనసు సేద తీరగా!

● వేసవి అలసట తీరుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు

భైంసా,మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండే ఎండల్లో ప్రభుత్వ కార్యాలయాలు కాస్తంతా చల్లదనాన్ని అందిస్తున్నాయి. వాటి ఆవరణలు ఉన్న వృక్షాలు, చెట్లు చల్లని గాలులను అందిస్తూ అలసినవారికి సేద తీరుస్తున్నాయి. దశాబ్దాల క్రితం కట్టిన కార్యాలయాలు కావడంతో నాటి పాలకులు, అధికారులు ముందుచూపుతో విస్తారంగా మొక్కలు నాటి సంరక్షించారు. దీంతో భారీ వృక్షాలుగా మారి పదిమందికి నీడనిస్తూ పర్యావరణానికి ఆయువుపట్టులా మారాయి. తహసీల్దార్ కార్యాలయం, కోర్టు, వి శ్రాంతి భవనం ,టౌన్ పోలీస్‌స్టేషన్, విద్యుత్తు సబ్ స్టేషన్, పశువైద్యశాల, వ్యవసాయ శాఖ, అర్‌అండ్‌బీ కార్యాలయాల అవరణల్లో భారీ వృక్షరాజసాలు దర్శనమిస్తాయి. తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాల అవరణలోని చెట్ల చుట్టు ప్రజలు కూర్చునేందుకు వీలుగా గద్దెలు ఏర్పాటు చేయడంతో వి విధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే జనాలకు చెట్ల కింద కాస్తంతా విశ్రాంతి దొరుకుతుంది. వేసవి వచ్చిందంటే అధికారులు సైతం చెట్లనీడనే సేద తీరుతున్నారు. మిగతా కార్యాలయాల్లోనూ ఈ విధంగా మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుంది.

భానుడి భగ భగ

●నిర్మల్ జిల్లాలో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
● రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగొచ్చని వాతావరణ శాఖ హెచ్చరిక

ఖానాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు ఎండ తీవ్రతరం అవుతోంది. భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తుండడంతో ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగు తున్నాయి. నిర్మల్ జిల్లాలో గురువారం 39.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యా యి. దీంతో అప్రమత్తమైన అధికారులు వడదెబ్బ భారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగు తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రానున్న రెండు రోజుల్లో అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి వాతావరణం వేడెక్కడంతో పటు తీవ్రమైన ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జనం ఇంట్లోంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లాలో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని వాతావరణ శాఖ చెబుతోంది.

నీళ్లు లేక
పశువులకు మేతగా పంట చేను

తాంసి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కంటికి రెప్పలా కాపాడుకున్న పంట నీళ్లు లేక ఎండిపోతుండడంతో.. ఆవేదన చెందిన ఓ రైతు పంటను పశువులకు మేతగా వదిలిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని తాంసి మండలం హసనాపూర్‌కు చెందిన రవి అనే రైతుకు గ్రామ శివారులో ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో రవి జొన్న పంటను సాగు చేశాడు. అయితే మరో 20 రోజుల్లో పంట కోతకు వచ్చే సమయంలో బోర్లు ఒట్టిపోవడంతో.. నీళ్లు లేక ఎండిపోతోంది. దీంతో చేసేదేమీ లేక సదరు రైతు బుధవారం ఆ పంట చేనులో పశువులకు మేపాడు. పంట సాగుకు సుమారు రూ. 80 వేల వరకు ఖర్చు చేశానని, కానీ నీళ్లు లేకపోవడంతో చేతికి చిల్లి గవ్వ చేతికి రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


ఇటీవల పంటను పరిశీలించిన కలెక్టర్(ఫైల్)


జొన్న పంట చేనులో పశువులు మేస్తున్న దృశ్యం


రైతు, రమేష్

● ఇటీవలే పంటను పరిశీలించిన ఆదిలాబాద్ కలెక్టర్

గత 15 రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో పంటల పరిస్థితిపై 'అయ్యో.. రైతన్న' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ రాజార్షి షా రైతుకు చెందిన పంట పొలాన్ని పరిశీలించారు. పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యల విషయమై రైతును అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. రైతుకు భరోసా కల్పించారు. కానీ ఎంతకూ నీటి తడి అందకపోవడంతో రవి ఆ పంటను కాస్త పశువులకు మేతగా వదిలాడు. తనను రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు రవి కోరుతున్నాడు.

ఫటా.. ఫట్...
వేసవి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం

● డాక్టర్ రాజేందర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, నిర్మల్



ఆంధ్రజ్యోతి: వేసవిలో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: ఎండలు ముదురుతున్న కారణంగా ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. గ్రామ స్థాయిలో సిబ్బందిని అందు బాటులో ఉంచడంతో పాటు అవసరమైన మందులు నిల్వ ఉండేలా చూస్తున్నాం. ఎండల పట్ల ప్రజలకు అవగాహన కల్పి స్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సిబ్బంది సమయపాలన ఎలా ఉంది..?

అధికారి: జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో నిర్మల్, భైంసా, ఖానాపూర్ సిబ్బంది సమయపాలన పాటించేలా చూస్తున్నాము. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బయోమెట్రిక్ అందుబాటులోకి తెచ్చాము. నిరంతరం జిల్లా కార్యాలయం నుంచి సిబ్బంది హాజరుతో పాటు పని తీరును సమీక్షిస్తాం.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీలలో మందుల కొరత మాటేమిటి..?

అధికారి: జిల్లాలో మందుల కొరత లేదు. వేసవి దృష్ట్యా అవసరమైన ఓఆర్ఎస్ సహా ఇతర మందులను నిల్వలు పెంచాము. సెంట్రల్ స్టోర్స్ నుంచి ఎప్పటికప్పుడు మందుల కొరత లేకుండా సరఫరా చేస్తున్నాము. మందుల కొరతపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి: డాక్టర్ల కొరతను ఎలా అధిగమిస్తారు..?

అధికారి: ఇటీవల ఉన్నత చదువుల కోసం పీజీ చదివేందుకు కొంతమంది వైద్యులు ఎంపికయ్యారు. దీంతో కొన్నిచోట్ల ఖాళీలు అయ్యే అవసరం ఉంది. ఇలాంటి పీహెచ్‌సీలను గుర్తించి ఆ ఖాళీలలో అదనంగా ఉన్న వైద్యులతో భర్తీ చేస్తాం. కొన్ని పీహెచ్‌సీలలో ఇద్దరేసి డాక్టర్లు ఉన్నారు. వారితో సర్దుబాటు చేస్తాము. ఇంకా అవసరమైతే కలెక్టర్ అనుమతితో కాంట్రాక్టు వైద్యులను నియమించే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై మీ స్పందన ఏమిటి..?

అధికారి: సిబ్బందిపై పని భారం ఉన్న మాట వాస్తవం. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కొన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి విషయంలో వారికి సమస్యలు రాకుండా చూస్తాము. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే చర్యలు తీసుకుంటాము.

ఆంధ్రజ్యోతి: సిబ్బంది కొరతపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

అధికారి: ప్రస్తుతం జిల్లాలో పారామెడికల్ పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయి. ఇటీవలనే ప్రభుత్వం చేపట్టిన నియామకాలకు పలు పోస్టులు భర్తీకి చర్యలు తీసుకున్నాము. మిగతా పోస్టులు కూడా త్వరలోనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాము. ● (నిర్మల్, ఆంధ్రజ్యోతి)

అర్హులైన రైతులకు కర్షక మిత్ర రుణాలందించేందుకు కృషి

● సంఘం చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి

తలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి కర్షక మిత్ర రుణాలు అందించేందుకు కృషి చేయాలని సంఘం చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి కోరారు. గురు వారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి అధ్యక్షతన సుంకిడిలో సంఘం డైరెక్టర్లతో కలిసి మహాజన సభ నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఈవో శ్రీనివాస్ సంఘం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న అగ్రిమార్ట్ అమ్మకాలు కొనుగోళ్లతో పాటు లావాదేవీలను వివరించారు. అగ్రి మాటు గత ఆరు నెలల కాలంగా లాభంలో ఉన్న ఆరు నెలల నుంచి నష్టా లలో నడుస్తుందని అమ్మకాలు అనుకున్న విధంగా జర గడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు లాభం రాని వ్యాపారం చేయకూడదని, రైతులకు తక్కువ ధరలకు నిత్యవసర సరుకులు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన నష్టంతో సంఘానికి నష్టం జరుగుతుందని తెలిపారు. అనంతరం చైర్మన్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రైతులకు రసాయన ఎరువులు విత్త నాలు, ఖరీఫ్ కోసం కూడా రైతులకు అవసరమయ్యే రసా యన ఎరువుల కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అలాగే గోదా ముల నిర్మాణాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మరి కొద్ది రోజుల్లో చేపడతా మన్నారు. గోదాముల నిర్మాణంతో నిలువ కిరాయి మిగులుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ పద్మాకర్ రెడ్డి, డైరెక్టర్లు మని రామ్ జాదవ్, సల్ల సుధాకర్, గంగారాం, ఆశమ్మ, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది సాగర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి

అడెల్లి రోడ్డుకు రూ.4 కోట్లు మంజూరు చేయండి

● అసెంబ్లీలో ప్రస్తావించిన బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అడవి రోడ్డు నిర్మాణానికి మరో నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేసి పూర్తి చేయాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కోరారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను ఏకరువు పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ బోథ్ అడెల్లి రోడ్డు నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఆ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. ఇంకా కొంత భాగం రోడ్డు పూర్తి చేయాల్సిందని అయితే నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేస్తే రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో పాటు దూర భారం తగ్గి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. అంతేగాక ఇచ్చోడ మండల కేంద్రంలో షాదీ ఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ రంజాన్ మాసంలోనే నిధులు మంజూరు చేయాలని చరణ్ కోరారు.


అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నీటి కోసం వెళ్లి.. తొట్టెలో ఇరుక్కున్న ఆవు


నీటి తొట్టెలో ఇరుక్కున్న ఆవు

తాంసి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రంలో ఓ ఆవు నల్ల నీటి తొట్టెలు ఇరుక్కుంది. దీంతో గ్రామ యువకులు పెద్ద ఎత్తున వచ్చి ఆవును రక్షించే ప్రయత్నం చేశారు. గురువారం దాహం తీర్చుకునేందుకు వెళ్లిన ఆవు తొట్టిలో పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దాహం తీర్చుకుందాం అని పోతే ఆ ఆవు ప్రాణాల మీదికి వచ్చినట్లు అయింది. దాహం తీర్చుకునేందుకు పశువులు సైతం పడరాన్ని పాట్లు పడుతున్నామని చెప్పవచ్చు. జేసీబీ సాయంతో ఆ ఆవును బయటకు తీసినప్పటికీ తీవ్ర గాయాలైనట్లు యువకులు పేర్కొన్నారు.

అటవీ ప్రాంతంలో
చెలరేగుతున్న కార్చిచ్చు


ఆటవీ ప్రాంతంలో అంటుకున్న కార్చిచ్చు

కడెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ అటవీ రక్షణ కోసం ముందస్తుగా ఎన్ని రక్షణ చర్యలు చేపట్టినా కూడా అడవిలోని కార్చిచ్చు మాత్రం ఆగడం లేదు. నచ్చన్ ఎల్లాపూర్ తండా గ్రామ సమీప ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. మంటలు అంటుకొని గంటలు గడిచినా అటవీ శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు రాలేదు. దీంతో మంటలు అటవీ ప్రాంతమంతా వ్యాపించాయి.


ఎలా ఉన్నావని డీఎస్పీని అడుగుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

స్నేహానికి కన్న మిన్న.. హోదా కాదుగా!

ఎవరు ఎంత పెద్ద హోదాలో ఉన్నా గతం తాలూకు స్నేహం గుర్తొస్తూనే ఉంటుంది. ఇందుకు తాజా ఉదాహరణే ఈ చిత్రం. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇదే సందర్భంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి కంట పడ్డారు. అంతే గతం తాలూకు జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయి. సిద్దిపేటలో వీరు ఇద్దరు డిగ్రీ చదివే సమయంలో క్లాస్ మేట్‌లు కావడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని వెంకటయ్య శాలువాతో సత్కరించి స్నేహానికి హోదా అడ్డుకాదని చాటి చెప్పారు. ఈ సన్నివేశం చూసి అక్కడున్న అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫోటోగ్రాఫర్)


స్నేహితున్ని సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్



అనుమతుల పేరిట
అడ్డగోలు దందా

- కజ్జర్ల అసైన్డ్ భూముల్లో విచ్చలవిడిగా మొరం తవ్వకాలు
- ల్యాండ్ లెవలింగ్ అంటూ రైతులతో రహస్య ఒప్పందాలు
- అసైన్డ్ భూమిని పట్టా భూమిగా చూపుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు
- అధికారులనే తప్పుదోవ పట్టించిన కాంట్రాక్టర్ కంపెనీ
- మామూళ్ల మత్తులో మైనింగ్, రెవెన్యూ శాఖాధికారులు

కజ్జర్ల శివారు ప్రాంతంలోని అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాలు చేపడుతున్న దృశ్యాలు

ఆదిలాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల పేరిట మొరం తవ్వకాలకు అనుమతులు తీసుకుంటూఅడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. కొంత మంది అధికారుల అండదండలు, అవినీతితో బడా కాంట్రాక్ట్ కంపెనీలు దోపిడీ దందాకు తెరలేపుతున్నాయి. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న దళిత రైతులకు గతంలో ప్రభుత్వం అసైన్డ్ భూములను కేటాయించింది. కానీ ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా క్షేత్ర స్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కేటాయించిన భూములు సాగుకు యోగ్యం లేవని కొందరు అసైన్డ్ భూముల్లో మొరాన్ని అమ్మేసుకుంటు అక్రమదందాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారు ప్రాంతంలోని అసైన్డ్ భూముల్లో విచ్చలవిడిగా మొరం తవ్వకాలను చేపడుతూ బొందల గడ్డలుగా మార్చేస్తున్నారు. జిల్లా మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారిని ఆనుకొని సర్వీసు రోడ్ల నిర్మాణం, మేయింటనెన్స్ పనులను దక్కించుకున్న శ్రీ శివసాయి సర్వీసెస్ కంపెనీ జిల్లా మైనింగ్ అధికారులకు మొరం క్వారీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో హడావిడిగా క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే మైనింగ్, రెవెన్యూ అధికారులు కజ్జర్ల గ్రామ శివారు ప్రాంతంలో మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. సర్వే నెంబర్ 142/85లో దళిత రైతు ఉడుగు దేవుబాయికి చెందిన రెండు ఎకరాల అసైన్డ్ భూమిలో మొరం తవ్వకాలకు అనుమతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్ట్ కంపెనీ రాత్రి పగలు అనే తేడా లేకుండా అడ్డగోలుగా మొరం తవ్వకాలను చేపడుతూ తరలించుకు పోతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా నిత్యం వందలాది వాహనాల్లో మొరాన్ని తరలిస్తూ అసైన్డ్ భూములను ధ్వంసం చేస్తున్నారు. అసలు నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాలను చేపట్టరాదంటూ అసైన్డ్ చట్టం చెబుతున్నా అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా కాంట్రాక్ట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నారు. అలాగే వారిచ్చే కాసులకు కక్కుర్తి పడి అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి!



అసైన్డ్ భూముల్లో నేరుగా మొరం తవ్వకాలను చేపట్టేందుకు అవకాశం లేకపోవడంతో కాంట్రాక్ట్ కంపెనీలు తెలివిగా వ్యవహరిస్తున్నాయి. రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకుంటున్న కంపెనీలు రైతులకు డబ్బును ఆశచూపి బుట్టలో వేసుకుంటున్నాయి. ఆ తర్వాత ఎవరికి అనుమానం రాకుండా ల్యాండ్ లెవలింగ్ పేరిట రహస్యంగా రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అసలు ల్యాండ్ లెవలింగ్ అంటే ఎత్తు పల్లాలుగా ఉన్న భూమిని పంటల సాగుకు అనుగుణంగా చదును చేసుకోవాల్సి ఉంటుంది. కానీ అసైన్డ్ భూముల్లో భారీ గుంతలు తవ్వి రోడ్డు నిర్మాణ పనులకు మొరాన్ని తరలించడం ఏవిధంగా ల్యాండ్ లెవలింగ్ అవుతుందో సంబంధిత అధికారులకే తెలియాలి మరి. ఉన్న భూమిని బొందలగడ్డలుగా మార్చి వదిలేయడమే తప్ప భూమిని చదును చేయడం ఎక్కడ కనిపించడం లేదు. అధికారులకు తప్పుడు ఒప్పంద పత్రాలను చూపించి అనుమతులు తీసుకుంటున్న బడా కాంట్రాక్ట్ కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. చెప్పేది ఒక టైతే చేసేది మరొకటి అన్నట్లుగా మారుతోంది. కనీసం ఏ వాహనాల్లో మొరంను తరలించే సమాచారం కూడా అధికారుల వద్ద లేక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు తన భూమిని రైతు లెవలింగ్ చేసుకుంటే మైనింగ్ అధికారులు, మండల తహసీల్దార్ అనుమతి ఎందుకు అవసరమో అధికారులే చెప్పాలి మరి.

పరిశీలించకుండానే అనుమతులు

తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారులో 4వేల క్యూబిక్ మీటర్ల మొరం క్వారీ కోసం శ్రీ శివసాయి సర్వీసెస్ కంపెనీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. దీంతో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరమే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పరిశీలించకుండానే అనుమతులు ఇవ్వడంపై ఆరోపణలు వస్తున్నాయి. సర్వే నెంబర్ 142/85 పట్టా భూమి అంటూ కాంట్రాక్ట్ కంపెనీ దరఖాస్తులోనే స్పష్టంగా పేర్కొంది. కానీ తలమడుగు తహసీల్దార్ మాత్రం అది అసైన్డ్ భూమి అంటూ మైనింగ్ అధికారులకు రిపోర్టు ఇవ్వడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న కాంట్రాక్ట్ కంపెనీకి అధికారులే అండగా నిలిచినట్లు దీంతో స్పష్టమవుతోంది. సంబంధిత రైతు పట్టాపాస్‌బుక్‌లో సైతం 142/85 సర్వే నెంబర్ అసైన్డ్ భూమి అని స్పష్టంగా ఉంది. కానీ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. మొరం తవ్వకాలకు అసైన్డ్ భూమిలో అనుమతులు ఏ విధంగా ఇచ్చారో అంతు చిక్కడం లేదంటున్నారు. ఒక వేళ రైతు సమ్మతితో ల్యాండ్ లెవలింగ్ కోసం అనుమతులు ఇస్తే కిలో మీటర్ల మేర మొరంను ఎలా

(మిగతా 6వ పేజీలో)

జిల్లా కలెక్టర్ ఆదేశాలతోనే అనుమతులు ఇచ్చాం

● రాంమోహన్, తహసీల్దార్, తలమడుగు



కజ్జర్ల గ్రామ శివారు ప్రాంతంలోని అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాల కోసం రోడ్డు నిర్మాణ సంస్థకు అనుమతులు ఇవ్వడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశించడంతోనే అనుమతులు ఇచ్చాం. అభివృద్ధి పనుల కోసం అసైన్డ్ భూముల్లోనూ మొరం తవ్వకాలు చేపట్టవచ్చు. పూర్తి సమాచారం జిల్లా మైనింగ్ అధికారుల వద్ద ఉంది. వారి ఆదేశాలతోనే పరిశీలించి 142/85 సర్వే నెంబర్ అసైన్డ్ భూమి అని నిర్ధారించి రిపోర్టు ఇవ్వడం జరిగింది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

● రవీందర్, జిల్లా మైనింగ్ అధికారి, ఆదిలాబాద్

జిల్లా కలెక్టర్ ఆదేశాలతోనే కాంట్రాక్టర్ కంపెనీకి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఏమైనా పొరపాట్లు జరిగితే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మొరాన్ని తరలించేందుకు అనుమతి ఉంది. రాత్రి వేళల్లో మొరం తరలించేందుకు అనుమతి లేదు. ఇప్పటికే సంబంధిత తహసీల్దార్‌తో పాటు కాంట్రాక్ట్ కంపెనీకి చెప్పడం జరిగింది. అసైన్డ్ భూమి విషయంలో తహసీల్దార్ రిపోర్టు ప్రకారమే అనుమతులు ఇచ్చాం.

ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష



చైర్మన్ బక్కి వెంకటయ్యకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ కేసులు, ప్రభుత్వాల ద్వారా వారికి అందుతున్న సేవలు, పథకాల అమలుపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయనకు కలెక్టర్ రాజర్షిషా పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. అనంతరం పోలీసుల గౌరవవందనం స్వీకరించి అధికారులతో సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధితోపాటు అట్రాసిటీ కేసుల గురించి తెలుసుకుంటు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు వారి సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకు వచ్చారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూడాలని కలెక్టర్‌తోపాటు ఆయా శాఖల అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ల్యాండ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు ఏప్రిల్ 30 వరకు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఇటీవల గుడిహత్నూర్‌లో ఆదివాసీ బాలికపై జరిగిన ఘటన బాధకరమన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంది రమ్మ ఇల్లు, ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం, రెండు రోజుల్లో అందేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లా ఇన్‌చార్జి సీతక్కతో మాట్లాడి జిల్లాలో డీవీఎంసీ కమిటీలను ఏర్పాటు చేసేల చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, ప్రవీణ్, ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా, డీఎఫ్ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో అగ్నిప్రమాదం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఆవరణలోని చెట్ల పొదల్లో మంటలు అంటుకున్నాయి. దీంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి అగ్ని మాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. చెట్ల పొదల మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అగ్ని మాపక సిబ్బంది సరైన సమయంలో రావడం, మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

బాల్య వివాహ ముక్త్ భారత్‌పై అవగాహన

నేరడిగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో బాల్యవివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కో-ఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగినా ఈ 1098 నెంబర్‌కి కాల్ చేసి వాటి సేవలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజుల మాట్లాడుతూ చిన్న పిల్లల పెళ్ళిళ్ళ వల్ల జరిగే అనర్థాల గురించి, పిల్లలలో పోషకాహార లోపం గురించి వివరించి పిల్లలతో బాల్య వివాహానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రజిత, డీసీపీయూ సోషల్ వర్కర్ రవి కాంత్ పాల్గొన్నారు.

'విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేస్తే సహించం'

నార్నూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని కొంత మంది ఉపాధ్యాయుల విధులకు హాజరు కాకుండా విద్యార్థుల విద్యాబోధన అందించక వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆదివాసీ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెందుర్ సంతోష్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రం వద్ద మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో పేదవారికి ప్రభుత్వ బడులే దేవాలయమన్నారు. రూ.లక్షల జీతాలు తీసుకొని కొంత మంది పాఠశాలకు రాకుండా విధులకు డుమ్మా కొడుతున్నారన్నారు. వారి వెంట నాయకులు మధు, గంగారాం, గోవింద్, విజయ్ ఉన్నారు.

స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణం

బోథ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 650 స్వయంసహాయక సంఘాల వారికి శ్రీనిధి నుంచి వడ్డీ లేని రుణాలను 18.72 లక్షలు, బ్యాంకు లింకేజీతో వడ్డీ లేని రుణాలు 95.16 లక్షల రూపాయలు అందించనున్నట్లు బోథ్ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తొలిశెట్టి ప్రమీళ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో 17 మండలాలకు గాను బోథ్ మండలంలో అత్యధికంగా 650 స్వయం సహాయక సంఘాలకు కోటి 13 లక్షల 87 వేల రూపాయలు ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక వడ్డీలేని రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు.

శనగ పంట కొనుగోళ్ల నిలిపివేత

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29 నుంచి 31 వరకు శనగ పంట కొనుగోళ్లు ఉండవని ఏఎంసీ జైనథ్ ఇన్‌చార్జీ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అమావాస్య, ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో మూడు రోజుల పాటు శనగ పంట కొనుగోలు నిలిపివేసినట్లు అధికారి పేర్కొన్నారు. తిరిగి ఏప్రిల్ 1న యథావిధిగా శనగ పంట కొనుగోలు ఉంటుందని ఈ విషయాన్ని రైతులు గమనించి, సహకరించాలని ప్రకటనలో కోరారు.

డయాగ్నోస్టిక్ కేంద్రాల మూసివేత



డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని సీజ్‌చేస్తున్న డీఈఎంవో

నేరడిగొండ, మార్చి 27 (ఆంధ్ర జ్యోతి): అనుమతులు లేకుండా డయాగ్నోస్టిక్ కేంద్రాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఈఎంవో వెంకట్‌రెడ్డి అన్నారు. డాక్టర్ రాథోడ్ సురేందర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశానుసారం నేరడిగొండ మండలంలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్, డయాగ్నస్టిక్స్ కేంద్రాలను గురువారం డీఈఎంవో వెంకట్ రెడ్డి తనిఖీ చేయగా వసంత్ డయాగ్నస్టిక్ సెంటర్, ఏఎస్ డయాగ్నస్టిక్ సెంటర్‌లను రిజిస్ట్రేషన్ లేని కారణంగా మూసివేశారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ల్యాబ్‌లను నిర్వహించినా, స్థాయికి మించి ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ వైద్యం అందించినా కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఆకస్మిక దాడులు నిరంతరం కొనసాగుతాయన్నారు. రిజిస్టరు కాని ల్యాబ్ యజమానులు, ప్రాక్టీషనర్స్ వెంటనే డీఎంహెచ్‌వో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. తనిఖీల్లో డీఈఎంవో వెంకట్‌రెడ్డి వైద్య అధికారులు, తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

గుడిహత్నూర్ , మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం గుడిహత్నూర్ వచ్చిన ఆయనకు అధికారులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్, కొమురం భీమ్ అన్నా బాహు సాఠే విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి బాధిత కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన ఆర్థికసహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశిస్తామన్నారు. పోలీసులు 22 మంది యువకులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని జిల్లా ఎస్పీకి ఆదేశిస్తామన్నారు. ఆయన వెంట ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ హై, ఆర్ఐ అరుణ్‌కుమార్ ఉన్నారు.

యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ



మీ సేవలో బారులు తీరిన దరఖాస్తుదారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో మీసేవా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. అర్హులైన యువతీ యువకులు పథకం లబ్ధి పొందేందుకు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అటు ఆదాయ కుల ధృవీకరణ పత్రాల కోసం సైతం దరఖాస్తులు చేసుకుంటుండడంతో రెవెన్యూ కార్యాలయ ప్రాంగణం కూడా సందడిగా మారింది.

(ఆదిలాబాద్ ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

నేరడిగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోల్ మామడ టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న గోవులను గోరక్షకులు పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేసి అక్రమంగా తరలిస్తున్న మూడుఐచర్, నాలుగు బోలేరో వాహనాలను పోలీసులకు అప్పగించినట్లు సంతోష్‌సింగ్ తెలిపారు. కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

కిట్ల పంపిణీ

నేరడిగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వడదెబ్బ భారిన పడకుండా తగిన జాగ్రత్తలతో చెక్‌పెట్టవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సద్దాం సూచించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిక్షయ్ పోసిన్ కిట్‌లు 29 రాగా వాటిని పంపిణీ చేశారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ కాలపరిమితి ముగియడంతో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన న్యాయవాదులు వారి ఓటు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ పి.డేవిడ్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా వినోద్‌రెడ్డి, ఎండి అబ్దుల్లా వ్యవహరించారు. అధ్యక్ష పదవికి ఎన్రాల నగేష్, మోహన్‌సింగ్, ప్రధాన కార్యదర్శికి ఇద్దరు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు పోటీలో ఉన్నారు. మొత్తం 167 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు హక్కును బ్యాలెట్ పేపర్ ద్వారా వినియోగించుకున్నారు. కాగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఏప్రిల్ 1న బాధ్యతలను ఇస్తామని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

మట్కాస్థావరంపై దాడి చేసిన పోలీసులు

● నిర్వాహకుడి అరెస్టు ● రూ.25వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం



జైనథ్ పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ

జైనథ్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిమ్మా గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న నిర్వాహకులపై గురువారం జైనథ్ మండల పోలీసులు దాడి నిర్వహించారు. జైనథ్ మండల ఎస్సై వి.పురుషోత్తం ఏఎస్సై సిరాజ్ కానిస్టేబుల్‌ల వికాస్, స్వామిలు దాడి చేసి మట్కా నిర్వాహకుడు ఆవునూరి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద గల రూ.25వేలు, సెల్‌పోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మట్కా చీటీ స్వాధీన పర్చుకున్నారు. అనంతరం జైనథ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ సాయినాథ్ మాట్లాడుతూ మట్కా ఆడించి డబ్బులను పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు పంపుతున్నారని అన్నారు. మట్కా కేసులో నిర్వాహకుడు ఆవునూరి శ్రీనివాస్ ఏ1, ఏ2గా మాదవ్, ఏ3గా అశోక్ సామ్రాట్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. జైనథ్ ఉమ్మడి మండలంలో మట్కా, గుట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని సీఐ సాయినాథ్ తెలిపారు.

విమానాశ్రయంపై పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీ



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ గోడంనగేష్

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి27 (ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన విమానాశ్రయం మంజూరు గురించి లోక్‌సభలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడంనగేష్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర విమానయాన మంత్రి ఇటీవల ఆదిలాబాద్ విమానాశ్రయం వ్యూహాత్మకమైన ప్రాంతమని, తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ రాష్ట్రాలకు కూడా ఎంతో ఉపయోగమని ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా కూడా ప్రి ఫెసిబిలిటి స్టడీ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఆ రిపోర్టు త్వరగా తెప్పించి విమానాశ్రయం మంజూరు చేయాలని కోరారు.

ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం



ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రాజేశ్వర్

నార్నూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షునిగా తాడిహత్నూర్ గ్రామానికి చెందిన ఉత్తర్‌వార్ రాజేశ్వరిని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత ప్రమాణ స్వీకారం చేయించారు. గురువారం రాజుల గూడ గ్రామంలో ఫంక్షన్‌హాల్ వద్ద జరిగిన కార్యక్రమానికి జిల్లా నుంచి భారీసంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధి కోసం తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.